సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



అత్యున్నత స్థాయికి ఎదగాలి

విద్యార్థులు చదువులో రాణిస్తూనే క్రీడల్లో కూడా అత్యున్నత స్థాయికి ఎదగాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఆకాంక్షించారు. 8లో



నరసింహదాసుకు నీరాజనం

ప్రముఖ వాగ్గేయకారుడు తూము నరసింహదాసు జయంతిని భద్రాద్రి రామాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 19°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముమ్మరంగా ముక్కోటి టికెట్ల విక్రయం

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ముక్కోటి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఉత్తర ద్వారదర్శనం కోసం ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం ముమ్మరంగా సాగుతోందని ఈఓ రమాదేవి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా టికెట్ల విక్రయాన్ని ఈనెల 22న ప్రారంభించారు. ఇప్పటివరకు వీఐపీ టికెట్లు 600లో 352, సెక్టార్–ఏ 300కు గాను 189, సెక్టార్–బీ టికెట్లు 650కి 136, సెక్టార్–సీ టికెట్లు 100కి 100, సెక్టార్–డీ 125కి 108, సెక్టార్–ఈ 500 టికెట్లకు గాను 142 టికెట్లను భక్తులు కొనుగోలు చేశారని ఈఓ తెలిపారు.

పల్లె దవాఖానాలో 'ఎన్‌క్వాస్' పరిశీలన



దవాఖానా సిబ్బందితో ఎన్‌క్వాస్ సభ్యులు

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలోని పల్లె దవాఖానాను ఎన్‌క్వాస్ కేంద్ర బృందం శనివారం పరిశీలించింది. దవాఖానాలో అందుతున్న వైద్యసేవల గురించి పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఎమ్ఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ల సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి రికార్డులు, గర్భిణులు, బాలింతల టీకాల కార్డులతో పాటు ఆస్పత్రి పరిసరాలను తనిఖీ చేశారు. తాము పరిశీలించిన అంశాల ఆధారంగా నివేదికలు తయారు చేయనున్నట్లు బృందం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌క్వాస్ ప్రతినిధులు డాక్టర్ శర్మ, రంజిత్ బారువా, జిల్లా బృందం ప్రతినిధులు డాక్టర్ స్పందన, శృతి, డీపీఎం దుర్గ, లక్ష్మీసాహితి తదితరులు పాల్గొన్నారు.


సారపాక యువతికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సుమలత

బూర్గంపాడు: మండలంలోని సారపాకకు చెందిన కొండ్లె సుమలతకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ మురళీకృష్ణ పర్యవేక్షణలో ఆమె సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. సారపాకకు చెందిన కొండ్లె నర్సింహారావు – వజ్రమ్మ దంపతుల కుమార్తె సుమలత చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయినా పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదిగింది. ప్రస్తుతం మహబూబాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న సుమలత డాక్టరేట్ అందుకోవడంతో పలువురు అభినందించారు.

జమలాపురంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున అర్చకులు శ్రీవారి పాదంతో పాటు మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే, స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించారు. వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

ఖమ్మంమయూరిసెంటర్: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆది, సోమవారాల్లో ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు. ఖమ్మంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండురోజుల పాటు జరిగే సమావేశాల్లో వివిధ అంశాలపై చర్చిస్తామని తెలిపారు. ప్రధానంగా విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రాజు, ఫర్వీన్, వీరేందర్, సాయి, సరళ, షరీఫా, నవ్య, వెంకటేష్, రాగిణి, ఉమేష్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పార్క్‌పై పట్టింపేది ?

- 'చల్లమల్ల' నిర్వహణలో లోపాలు
- శిథిలావస్థకు చేరిన కేబుల్ వంతెన
- వృథాగా మారుతున్న వాటర్ టూరిజం
- సెంట్రల్ పార్క్‌పై దృష్టి పెట్టని అటవీ అధికారులు



నిర్వహణ సక్రమంగా లేక నిరుపయోగంగా మారిన పార్క్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో జిల్లా కేంద్రంలో హరితా హోటల్, కిన్నెరసాని కాటేజీలు, సెంట్రల్ పార్కు పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో హరితా హోటల్, కన్వెన్షన్ హాల్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కిన్నెరసాని కాటేజీలను ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభించినా ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. కానీ వీటన్నింటి కంటే ముందే సర్వాంగ సుందరంగా సిద్ధమై ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతోంది సెంట్రల్ పార్క్. కొత్తగూడెం పట్టణంలోని అటవీ శాఖకు చెందిన భూములకు రక్షణ కల్పించడంతో పాటు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేందుకు ఈ పార్కును నిర్మించారు.

చల్లమల్ల పేరుతో..

ఇల్లెందు క్రాస్‌రోడ్డు దగ్గర సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో ఏడేళ్ల క్రితం సెంట్రల్ పార్కు సిద్ధమైంది. సుమారు రూ 1.50 కోట్ల వ్యయంతో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించారు. అప్పటికే ఉన్న చిట్టడవికి తోడు హరితహారం పథకంలో సుమారు లక్ష వరకు వివిధ రకాల మొక్కలు నాటారు. పార్కుకు వచ్చే వారికి మరిన్ని సేవలు అందించేందుకు ఓపెన్ జిమ్, కేఫ్‌టేరియా, చిల్డ్రన్స్ ప్లే జోన్ ఏర్పాటు చేశారు. అక్కడితో ఆగకుండా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ప్రత్యేకంగా తెప్పించుకుని యోగా షెడ్లు, వాకింగ్ ట్రాక్, టాయిలెట్లు నిర్మించారు. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకు దీటుగా సెంట్రల్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చల్లమల్ల శ్రీనివాసరావు మెమోరియల్ పార్కుగా ఇటీవల దీని పేరు మార్చారు.

నిర్వహణపై దృష్టేది..?

జిల్లా కేంద్రంలో ఉన్న సెంట్రల్ పార్కు నిర్వహణ విషయంలో అటవీ శాఖ పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పార్కు ప్రారంభించినప్పుడు అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో భాగంగా కేబుల్ వంతెనలు ఏర్పాటు చేశారు. ఎత్తయిన మామిడి చెట్ల మధ్య నుంచి సుమారు వంద మీటర్ల వరకు వివిధ ఎత్తుల్లో కేబుల్ వంతెనలు నిర్మించారు. ఆరంభంలో ఈ పార్కుకు వచ్చే సందర్శకులను ఈ కేబుల్ వంతెన విశేషంగా ఆకట్టుకునేది. ఎక్కడో సినిమాల్లో చూడటమే తప్ప నిజ జీవితంలో ఇలాంటి అనుభవం పొందడం అరుదు అనిపించే విధంగా ఈ కేబుల్ బ్రిడ్జి అందరినీ ఆకట్టుకుంది.



సెంట్రల్ పార్క్‌లో పనిచేయని కేబుల్ వంతెన

అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో కాలక్రమంలో కేబుల్ వంతెనకు రిపేర్లు వచ్చాయి. అయినా పట్టించుకోకపోవడంతో వంతెన ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. దాని పైకి చేరుకునేందుకు, దిగేందుకు వీలు లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎత్తయిన చెట్ల మధ్యన గత వైభవానికి గుర్తుగా ఈ అడ్వెంచర్ స్పోర్ట్స్ మాత్రమే పార్కులో మిగిలిపోయింది.

ప్రారంభానికి నోచుకోని బోటింగ్..

ఇటీవల చల్లమల్ల శ్రీనివాసరావు మెమోరియల్



ఇటీవల ప్రారంభించిన వాచ్‌టవర్

పార్కులో ఉన్నతాధికారుల కోసం కిన్నెరసాని, గోదావరి పేరుతో క్యాంపు కార్యాలయాలు నిర్మించారు. ఆ తర్వాత ఇదే పార్కులో మూడు అంతస్తులతో ఓ వాచ్‌టవర్ సైతం నిర్మించారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు గత నెలలో దీన్ని ప్రారంభించారు. కానీ ఈ వాచ్‌టవర్ పక్కన శిథిలావస్థలో ఉన్న కేబుల్ వంతెనను పునరుద్ధరించే విషయంలో మాత్రం చూసీ చూడనట్టుగా వదిలేశారు. కేబుల్ వంతెనతో పాటు వాటర్ స్పోర్ట్స్‌లో భాగంగా సెంట్రల్ పార్కులో ఓ మినీ చెరువు నిర్మించారు. ఇందులో బోటింగ్ చేసేందుకు వీలుగా జెట్టీలు కూడా ఏర్పాటు చేశారు. కానీ అది ప్రారంభానికి నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఇప్పటికే కొనుగోలు చేసిన బోట్లు చెత్త కుప్పల్లోకి చేరిపోగా సుందరంగా మార్చిన చెరువు ప్రాంగణం అంతా పిచ్చి మొక్కలతో నిండి కళావిహీనంగా మారుతోంది.

ఇకనైనా చేస్తారా..

విస్తారమైన అడవులు, కిన్నెరసాని డ్యామ్, భద్రాచలం పుణ్యక్షేత్రం ఉన్న భద్రాద్రి జిల్లాలో పర్యాటకులను ఆకట్టుకునేందుకు ప్రభుత్వ పరంగా చేపట్టిన చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. అందువల్లే ఎకో టూరిజంలో భాగమైన కిన్నెరసాని కాటేజీలు, కొత్తగూడెంలో హరితా హోటల్ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. బోట్ హౌస్ కాన్సెప్ట్ అటకెక్కింది. గత రెండు ప్రభుత్వాల హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు ఇప్పుడైనా పూర్తి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

భద్రగిరిలో భక్తుల కోలాహలం

- నృసింహ రూపుడైన భద్రాద్రి రామయ్య
- దర్శనానికి బారులుదీరిన భక్తులు
- నేడు వామనావతారంలో దర్శనం



స్వామివారిని స్టేడియానికి తీసుకెళ్తున్న భక్తులు, అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశీ ప్రయుక్త అధ్యయనోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజైన శనివారం స్వామివారు నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి మూలమూర్తులకు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను నరసింహావతారంలో అలంకరించి బేడా మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు 200 పాశురాల ప్రబంధాలను పఠించారు. నరసింహావతారంలో ఉన్న స్వామి వారిని ప్రత్యేక పల్లకీపై కోలాట ప్రదర్శనలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి మిథిలా స్టేడియంలో వేంచేపు చేశారు. నరసింహావతారంలో ఉన్న స్వామివారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు అవతార విశిష్టతను వివరించారు. స్వామివారు భక్తుల పూజలందుకున్న అనంతరం తిరువీధి సేవ గావించారు.

గ్రామరక్షకుడిగా స్వామివారు..

నరసింహావతారంలో ఉన్న స్వామివారిని గ్రామ రక్షణార్థం తిరువీధి సేవ కొనసాగించడం ఈ అవతారం ప్రత్యేకత అని వేదపండితులు తెలిపారు. గ్రామంలోకి ఎలాంటి దుష్టశక్తులు రాకుండా, ఎలాంటి ఆపదలు సంభవించకుండా ఉండేందుకే నరసింహావతారంలో స్వామి వారు పురవీధుల్లో సంచరిస్తారని వివరించారు. నరసింహావతారంలో రెండు ముఖాలు కలిగి ఉండి భక్తులకు దర్శనమివ్వటం ఈ అలంకార విశిష్టత అని తెలిపారు. ఆ తర్వాత స్వామివారిని అంతరాలయంలోకి తీసుకెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.



నరసింహావతారంలో ఉన్న స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

నేడు వామనావతారంలో..

ఉత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్ర స్వామి ఆదివారం వామనావతారంలో దర్శనమివ్వనున్నారు. దేవతల సర్వసంపదలను తన స్వాధీనం చేసుకున్న రాక్షస రాజైన బలిచక్రవర్తి దగ్గరికి శ్రీహరి వామన రూపంలో వెళ్లి మూడు అడుగులు దానంగా స్వీకరించి, ఒక అడుగుతో భూమిని, రెండో అడుగుతో ఆకాశాన్ని, మూడో అడుగును బలి తలపై మోపి త్రివిక్రముడవుతాడు. ఈ అవతారాన్ని దర్శించడం వల్ల గురుగ్రహ బాధలు తొలుగుతాయని ప్రతీతి.

యాసంగికి తాలిపేరు నీరు నిలిపివేత

- మరమ్మతుల నేపథ్యంలోనే నిర్ణయం
- ప్రాజెక్టు ఈఈ రాంప్రసాద్

చర్ల: తాలిపేరు ప్రాజెక్టు, కాలువల మరమ్మతుల నేపథ్యంలో యాసంగి పంటలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ రాంప్రసాద్ తెలిపారు. మండలంలోని సత్యనారాయణపురం రైతు వేదికలో ప్రాజెక్టు రెండో జోన్ పరిధిలోని రైతులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యాసంగి పంటలకు రొటేషన్ పద్ధతిలో సాగునీరు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ ప్రాజెక్టు, కాలువలను రిపేర్ చేస్తున్నందున విడుదల సాధ్యం కాదని చెప్పారు. అయితే తాము ఇప్పటికే వరినారు పోశామని, నీటి సరఫరా నిలిపివేత విషయాన్ని ముందే చెప్పాల్సిందని రైతులు ఈఈతో వాదనకు దిగారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడితే ఇక ముందు ప్రాజెక్టు పరిధిలోని



మాట్లాడుతున్న ప్రాజెక్టు ఈఈ రాంప్రసాద్

రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, పంటలు ఎండిపోకుండా సాగునీరు విడుదల చేసే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రాజెక్టు మరమ్మతుల కోసం ఇప్పటికే పలుమార్లు ఇరిగేషన్ ఉన్నతాధికారులు పరిశీలించారని, త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని చెప్పారు. సమావేశంలో డీఈ తిరుపతి, సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరాజు, పర్ణశాల సర్పంచ్ వరలక్ష్మి, ఏఈ ఉపేంద్ర, ఏఓలు శివరాంప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

23 నుంచి రాష్ట్ర స్థాయి బాలికల క్రికెట్ పోటీలు

కొత్తగూడెంఅర్బన్/అశ్వాపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 26 వరకు అండర్ –17 బాలికల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ చైర్మన్, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఎస్‌జీఎఫ్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. అశ్వాపురంలోని భారజల కార్మాగారం మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీలకు ఇతర జిల్లాల నుంచి వచ్చే బాలికల జట్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని సభ్యులకు సూచించారు. కాగా, జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి స్టెల్లా జ్ఞానవతి ఆధ్వర్యాన శనివారం క్రికెట్ మైదానాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం స్టెల్లా మాట్లాడుతూ.. క్రికెట్ పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి జట్లు హాజరవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ కందుల శ్రీనివాసరావు, క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలెబోయిన అనిల్‌కుమార్, పీఈటీలు వీరన్న, ఆదినారాయణ, దశమిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

నిరంకుశ పాలన నుంచి విముక్తి

టీజేఎస్ అధినేత కోదండరామ్

దమ్మపేట: అనేక త్యాగాలు, పోరాటాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వంలోని నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించిందని తెలంగాణ జన సమితి(టీజేఎస్) అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తుందని, ప్రతి పేదవాడి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందని ఆశిస్తున్నానని చెప్పారు. మండలంలోని సరోజనాపురంలో శనివారం భారతీయ సర్వసమాజ్ మహాసింగ్(బీఎస్ఎస్ఎం) నేత మద్దిశెట్టి సామేలు ఆధ్వర్యంలో కోదండరామ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కోదండరామ్ మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లు, పోడు రైతులకు పట్టాలు తదితర సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళతానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దిశెట్టి అజయ్, సత్యప్రసాద్, శ్రీరాముల ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోదండరామ్

'డ్రాగన్'కు శ్రీకారం!

- తొలిసారిగా ఏజెన్సీలో పంట సాగు
- ఆసక్తిగా పరిశీలిస్తున్న తోటి రైతులు

అశ్వారావుపేటరూరల్: దక్షిణ అమెరికాలో మొదలైన డ్రాగన్ ఫ్రూట్ పంట ఎల్లలు దాటి మారుమూల పల్లె ప్రాంతాలకు సైతం విస్తరిస్తోంది. ఇప్పటికే రాష్ట్రం, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగులోకి వచ్చిన ఈ డ్రాగన్ సాగుపై రైతుల్లో రోజు రోజుకూ ఆసక్తి పెరుగుతోంది. కాగా ఏజెన్సీ ప్రాంతంలోని అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామ సమీపంలో తాజాగా ఓ రైతు డ్రాగన్ పంట సాగుకు శ్రీకారం చుట్టాడు. దీంతో తొలిసారిగా ఏజెన్సీలో సాగులోకి వచ్చిన ఈ పంటను పలువురు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు.

రాళ్ల పొలంలో సాగు..

అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామానికి చెందిన బీర్రం వెంకటేశ్వరరావు అనే రైతుకు గ్రామ సమీపంలో ఏడెకరాల భూమి ఉంది. ఇదంతా పెద్ద పెద్ద రాళ్లతో ఉండడంతో ఇంతకాలం జామాయిల్ సాగు చేశాడు. కాగా డ్రాగన్ మొక్క రాతి నేలలు, మట్టితోపాటు, ఎలాంటి నేలల్లోనైనా పెరిగేది కావడంతో తక్కువ ఆదాయం వస్తున్న జామాయిల్‌ను తొలగించి డ్రాగన్ సాగుకు శ్రీకారం చుట్టాడు.

ఎకరానికి రూ.7 లక్షలు పెట్టుబడి..

డ్రాగన్ మొక్కలు ఎలాంటి వాతావరణాన్ని అయినా తట్టుకుని బతుకుతాయి. ఒక్కసారి పెట్టుబడి పెట్టి సాగు చేస్తే దాదాపు 20 ఏళ్లకు పైగానే దిగుబడి వస్తుందని వెంకటేశ్వరరావు చెబుతున్నాడు. కాగా, ఈ పంట సాగుకు ఎకరానికి సుమారు రూ.7లక్షల వరకు ఖర్చవుతుంది. ఒక ఎకరం భూమిలో 4వేల డ్రాగన్ మొక్కలు సాగు చేయొచ్చు. ఎకరానికి 500 సిమెంట్ స్తంభాలు అవసరం కాగా, ఒక్కో స్తంభానికి 10 మొక్కల చొప్పున నాటాడు. ట్రెల్లిస్ పద్ధతిలో పంట సాగు చేస్తున్నాడు. మొక్కలకు నీరు అందించేందుకు డ్రిప్ సిస్టమ్ ఏర్పాటు చేశాడు. ఈ పంట సాగుకు నీరు పెద్దగా అవసరం ఉండదని, ఇతర పంటల మాదిరి సాగు నీటి కోసం ఇబ్బంది ఉండదని రైతు చెబుతున్నాడు. మొదటి ఏడాది భారీగా పెట్టుబడి పెట్టినా.. ఇక ఆ తర్వాత సాగు ఖర్చు అంతగా ఉండదని, దిగుబడి వచ్చే కొద్దీ లాభాలు పొందే అవకాశాలు ఉంటాయని అంటున్నాడు. ఈ ప్రాంతంలో తొలిసారి సాగు చేస్తున్న డ్రాగన్ పంట గురించి తెలుసుకుని పలువురు రైతులు ఆసక్తిగా చూస్తున్నారు.



ఆసుపాకలో సాగు చేస్తున్న డ్రాగన్ పంట

ఏడెకరాల్లో సాగు చేస్తున్నా



నాకున్న ఏడెకరాల్లో తొలిసారి డ్రాగన్ పంట సాగు చేస్తున్నా. పెట్టుబడి భారీగా ఉన్నప్పటికీ, దిగుబడి మొదలైతే లాభాలు వస్తాయి. ఎకరానికి 5 నుంచి 10 టన్నుల వరకు పండ్ల దిగుబడి వస్తుంది. ఈ పండుకు మార్కెట్‌లో అధిక ధరతో పాటు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. రాబోయే కాలంలో ఈ డిమాండ్ మరింతగా పెరిగే అవకాశాలు ఉంటాయి. ప్రస్తుతం పండ్ల విక్రయాలకు స్థానికంగా మార్కెట్ లేదు. దిగుబడి ప్రారంభమైతే హైదరాబాద్ లేదా ఖమ్మం తీసుకెళ్లి విక్రయించాల్సి ఉంటుంది.

– బీర్రం వెంకటేశ్వరరావు, రైతు

విజ్ఞాన యాత్రతో అవగాహన

అశ్వారావుపేటరూరల్: ఏపీ కొబ్బరి బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన యాత్ర ద్వారా స్థానిక రైతులకు కొబ్బరి తోటలు, ఉత్పత్తులపై అవగాహన పెరిగిందని కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాము అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అశ్వారావుపేట, దమ్మపేట, సత్తుపల్లి ప్రాంత రైతులను ఇటీవల ఏపీ కొబ్బరి బోర్డు ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రంలోని పొలాచ్చికి తీసుకెళ్లామని, కొబ్బరి తోటల సాగు విధానం, అనుబంధ పరిశ్రమలు, పరిశోధన కేంద్రాలు, నీటి ఎద్దడిని తట్టుకునే కొబ్బరి మొక్కల రకాల గురించి వివరించినట్లు చెప్పారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, తుంబూరు ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ రెడ్డి, దొడ్డా రామకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, బి.ప్రసాద్‌రావు, సంతపూరి చెన్నారావు, పసుపులేటి ఆదినారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలపాటి రాము, రైతులు

నేడు గ్రంథాలయ ప్రారంభోత్సవం

రూ.2కోట్ల సొంత నిధులతో నిర్మించిన ఎంపీ పార్థసారధిరెడ్డి

సత్తుపల్లి: రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి రూ.2 కోట్ల సొంత నిధులతో వైట్‌హౌస్‌ను తలపించేలా నిర్మించిన అత్యాధునిక డిజిటల్ గ్రంథాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. సత్తుపల్లిలో నిర్మించిన ఈ గ్రంథాలయం వద్ద ఆదివారం ఉదయం ఎంపీ పూజలు చేసిన అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థకు అప్పగించనున్నారు. ఇక్కడ 12 కుంటల భూమిలో రెండంతస్తుల్లో భవనాన్ని నిర్మించారు. ఇందులో రెండు కాన్ఫరెన్స్ హాళ్లు, డిజిటల్ లైబ్రరీ ఉండడమే కాక ఇతర వసతులు సమకూర్చారు.

ఎంపీ సంకల్పం.. విద్యార్థులకు విజ్ఞానం

ఎంపీ బండి పార్థసారధిరెడ్డి సత్తుపల్లిలో చదువుకోగా, ఇక్కడి జ్ఞాపకాలను పలుమార్లు గుర్తుచేసుకుంటారు. ఈ ప్రాంత విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడాలనే సంకల్పంతో రాజ్యసభ సభ్యుడి హోదాలో తొలిసారి సత్తుపల్లికి వచ్చినప్పుడు గ్రంథాలయ నిర్మాణానికి హామీ ఇచ్చారు. అన్ని సౌకర్యాలు, అవకాశాలు కల్పిస్తే ఇక్కడ విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణిస్తారనే సంకల్పంతో రూ.2కోట్ల నిధులతో లైబ్రరీని నిర్మించగా, ఆదివారం విద్యార్థి లోకానికి అంకితం ఇస్తున్నారు. ఇక్కడ ఇంటర్నెట్‌తో కూడిన డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను అందుబాటులోకి రానున్నాయి. ఆహ్లాదం పంచేలా పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వగా, కళాశాలలకు సమీపంలో లైబ్రరీ ఉండడంతో విద్యార్థులకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.



ప్రారంభానికి ముస్తాబైన లైబ్రరీ

క్లుప్తంగా

అలరించిన చిన్నారుల ప్రదర్శనలు



విష్ణు చిత్త విజయం నాటకంలోని దృశ్యం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకల్లో భాగంగా మిథిలా స్టేడియంలో శనివారం ప్రదర్శించిన విష్ణు చిత్త విజయం హరికథ, భక్త ప్రహ్లాద నాటకం భక్తులను అలరించాయి. ఈ హరికథ, నాటకంలో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, సంగీత కచేరి, సంకీర్తనార్చన, నృత్య ప్రదర్శనలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి.

ఏటీడీఓ డిప్యూటేషన్ రద్దు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఏటీడీఓ)గా విధులు నిర్వర్తిస్తున్న గ్రేడ్–1 వసతిగృహ సంక్షేమాధికారి ఎన్.తిరుమలరావు డిప్యూటేషన్‌ను రద్దు చేశారు. ఈమేరకు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో వైరా అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్‌కే.జహీరుద్దీన్‌కు బాధ్యతలు అప్పగించగా, తిరుమలరావును పాల్వంచ షెడ్యూల్ ట్రైబల్ బాయ్స్ హాస్టల్‌కు కేటాయించారు.

దత్తత గ్రామంలో సర్వే



గ్రామంలో సర్వే చేస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన మండలంలోని నారాయణపురంలో వ్యవసాయ ఆర్థిక సర్వే శనివారం జరిగింది. కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులు గ్రామంలోని సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించి బ్యాంకు లావాదేవీలు, రైతులకు అందించే వ్యవసాయ రుణాలు, ఎరువులు, బ్యాంకు నిర్వహణ పద్ధతులను తెలుసుకున్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులు, రైతుల పొలాలు, రోజువారీ కూలీలు, పంటల ప్రణాళికలు, పాడి పశువులు, వ్యవసాయ పనిముట్లు, సాగు నీటి వినియోగం, మార్కెటింగ్ విధానాలు, సాగు సమస్యలు, పంట ఖర్చు, దిగుబడి, ఆదాయం వంటి విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణతేజ, డాక్టర్ రాంప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసులు నమోదు

దమ్మపేట: భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్త, ఆయన కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ముష్టిబండ గ్రామానికి చెందిన నారపోగు నాగమణి (26)ని కొంతకాలంగా ఆమె భర్త రవి, ఆయన కుటుంబ సభ్యులు సునందరావు, యశోద అదనపు కట్నం తేవాలని డిమాండ్ చేస్తూ, మానసిక, శారీరక వేధింపులకు గురిచేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవి కుమార్ తెలిపారు.

భద్రాచలంలో..

భద్రాచలంఅర్బన్: భార్యను వేధిస్తున్న భర్తపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలో మెడికల్‌కాలనీకి చెందిన శ్రీవల్లికి నర్సింహారావుతో తొమ్మిదేళ్ల కిందట వివాహం జరిగింది. కొంతకాలంగా నర్సింహారావు అదనపు కట్నం కోసం శ్రీవల్లిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శ్రీవల్లి ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్‌ఐ పీవీఎన్ రావు కేసు నమోదు చేశారు.

చోరీ ఘటనపై..

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామంలోని కిరాణా దుకాణంలో చోరీ జరగగా పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కందిమళ్ల గౌరీనాథ్ (36) కిరాణా వ్యాపారం చేస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వచ్చాడు. 13న ఉదయం దుకాణానికి వెళ్లి చూడగా గుర్తు తెలియని దుండగులు లోపలికి చొరబడి చోరీకి పాల్పడినట్లు గుర్తించాడు. రూ.15,000 నగదు, రూ.6,500 విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లు చోరీ చేశారని బాధితుడు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

బొగ్గు లారీ బోల్తా..

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి సమీపాన శనివారం బొగ్గు లారీ బోల్తా పడింది. టైర్ పంక్చర్ కావడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న లారీ బోల్తా పడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనతో ట్రాఫిక్ నిలిచిపోగా, తల్లాడ పోలీస్ కానిస్టేబుల్ బాలాజీ తదితరులు చేరుకుని లారీని తీయించాక వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

క్రీడల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలి

- భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్
- ముగిసిన గిరిజన ఆశ్రమ పాఠశాలల క్రీడోత్సవాలు
- ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన దమ్మపేట జోన్



దమ్మపేట జోన్‌కు ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీ అందజేస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

పాల్వంచ: గిరిజన, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు చదువులో రాణిస్తూనే క్రీడల్లో కూడా అత్యున్నత స్థాయికి ఎదగాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆకాంక్షించారు. పాల్వంచ మండం కిన్నెరసానిలోని మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఐటీడీఏ పరిధి పాఠశాలల క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఎనిమిది క్రీడాంశాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఏడు జోన్ల నుంచి 674 మంది బాలురు, 621 మంది బాలికలు పాల్గొనగా విజేతలకు పీఓ బహుమతులు అందజేసి మాట్లాడారు.

సాధనతో విజయం..

క్రీడల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు నిత్య సాధన అవసరమని పీఓ ప్రతీక్ తెలిపారు. గెలుపోటములు సహజమని.. నిరంతరం సాధన చేయడం ద్వారా విజయాలు సొంతమవుతాయని చెప్పారు. ఈ విషయంలో విద్యార్థులను అధికారులు, అధ్యాపకులు, క్రీడా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. కాగా, పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను దమ్మపేట జోన్ కైవసం చేసుకోగా, ప్రతిభ కనబర్చిన 224 మంది బాలికలు, 224 మంది బాలురను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో భద్రాచలం, ఖమ్మం డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, అధికారులు ఎస్.చంద్రమోహన్, పి.నరసింహారావు, బి.రూపాదేవి, కె.జహీరుద్దీన్, తిరుమల్‌రావు, కె.రమణయ్య, మంగతాయారు, బి.గోపాల్‌రావు, కె.వెంకటనారాయణ, ఎస్.నాగేశ్వరరావు, బి.రాంబాబు, బి.నెహ్రూ, వీరూనాయక్, బి.వెంకటేశ్వర్లు, బాలసుబ్రహ్మణ్యం, హరికృష్ణ, కె.వెంకటేశ్వర్లు, రామారావు, గోపాల్‌రావు, శిరోమణి, ఈశ్వర్‌రావు, మోతీలాల్, ముత్తయ్య, కృష్ణారావు, చందు, భద్రు, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

చివరి రోజు విజేతలు వీరే..



అండర్-17 ఖో-ఖో విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న పీఓ

సీనియర్స్ బాలికల విభాగం నుంచి వాలీబాల్‌లో ఇల్లెందు, దుమ్ముగూడెం, మణుగూరు జోన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కబడ్డీలో ఇల్లెందు, దుమ్ముగూడెం, వైరా, ఖో–ఖోలో మణుగూరు, ఇల్లెందు, వైరా, టెన్నీకాయిట్‌లో వైరా, ఖమ్మం, మణుగూరు మొదటి మూడు స్థానాల్లో నిలవగా, ఆర్చరీలో ఇల్లెందు, దుమ్ముగూడెం క్రీడాకారులు మొదటి, రెండో స్థానాల్లో నిలిచారు. జూనియర్స్ బాలికల విభాగం నుంచి వాలీబాల్‌లో దమ్మపేట, దుమ్ముగూడెం, వైరా, ఖో–ఖోలో దుమ్ముగూడెం, ఇల్లెందు, వైరా మొదటి మూడు స్థానాల్లో నిలవగా, టెన్నీకాయిట్‌లో దమ్మపేట, వైరా, ఆర్చరీలో ఇల్లెందు, దుమ్ముగూడెం క్రీడాకారులు మొదటి, రెండు స్థానాలు దక్కించుకున్నారు.



అండర్-14 ఖోఖో విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న పీఓ

తూము నరసింహదాసుకు నీరాజనాలు

ఘనంగా వాగ్గేయకారుడి 233వ జయంతి



నరసింహదాసు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అర్చకులు, ఈఓ, తదితరులు



గ్రంథావిష్కరణలో ఈఓ రమాదేవి, రచయిత తదితరులు

భద్రాచలం: భద్రాద్రి రామయ్యకు రామదాసు అనంతరం అపర భక్తుడిగా పేరుగాంచిన ప్రముఖ వాగ్గేయకారుడు తూము లక్ష్మీనరసింహదాసు 233వ జయంతి వేడుకలను శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యాన శనివారం ఘనంగా నిర్వహించారు. రాముడిపై భక్తితో కీర్తనలు రచించడమే కాకుండా ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేసిన ఆయనను ఘనంగా స్మరించుకున్నారు. తొలుత ఆస్థాన విద్వాంసుల కీర్తనలు, అర్చకుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాల నడుమ ప్రధాన ఆలయం నుంచి తూము నరసింహదాసు చిత్రపటంతో ఊరేగింపుగా భద్రగిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న నరసింహదాసు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ రమాదేవి నరసింహదాసు వారసులను సత్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, పండితులు, అర్చకులు, సిబ్బంది, నరసింహదాసు వంశస్తులు పాల్గొన్నారు.

నరసింహదాసు గ్రంథావిష్కరణ..

భద్రాచలం దేవస్థానానికి చెందిన పండితులు ఎస్‌టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు రచించిన తూము లక్ష్మీనరసింహదాసు గ్రంథాన్ని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఈఓ రమాదేవి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. రాముడి భక్తుడైన లక్ష్మీనరసింహదాసు జయంతి సందర్భంగా వారి వంశస్తులు ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా గ్రంథాన్ని ఆవిష్కరించటం గొప్ప విషయమని తెలిపారు. గ్రంథ రచయిత కృష్ణమాచార్యులు, చిత్రకారుడు తంబలి శివాజీని అభినందించగా, ఎస్‌టీజీ శ్రీమన్నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా... ఉత్కంఠగా

కొనసాగుతున్న రీజినల్ స్థాయి సెయింట్ ఆన్స్ పోటీలు



బాలుర వాలీబాల్ మ్యాచ్ దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: సెయింట్ ఆన్స్ పాఠశాలల రీజినల్ స్థాయి క్రీడా పోటీలు ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో కొనసాగుతున్నాయి. ఈ పోటీల్లో 27 సెయింట్ ఆన్స్ పాఠశాలల నుంచి జట్లు పాల్గొంటున్నాయి. అథ్లెటిక్స్ బాలబాలికల పోటీలు సెమీఫైనల్స్‌కు చేరుకోగా, ఖో–ఖో, బాస్కెట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ పోటీలు లీగ్ దశలో ఉన్నాయి. కాగా, టోర్నీని మరియ సుందరి, నక్షత్రం పర్యవేక్షిస్తున్నారు. కాగా, శనివారం జరిగిన వాలీబాల్ లీగ్ పోటీల బాలుర విభాగంలో ఖమ్మంపై హుజూర్‌నగర్, చెన్నైపై ఏలూరు, నూతనకల్‌పై చెన్నై, బనిగండ్లపాడుపై ఏలూరు జట్లు విజయం సాధించాయి. బాలికల విభాగంలో ఏలూరుపై సికింద్రాబాద్, వైజాగ్‌పై మంగళగిరి, వైజాగ్‌పై నల్లగొండ జట్లు గెలిచాయి. బాలికల త్రోబాల్‌లో వినన్నపేటపై ప్రసాదంపాడు, సికింద్రాబాద్‌పై ఖమ్మం, పెద్దఅవుతుపల్లిపై హుజూర్‌నగర్, ఖో–ఖో బాలురలో వైజాగ్‌పై ఖమ్మం, పెద్దఅవుతపల్లిపై సూర్యాపేట, నల్లగొండ నూతనకల్, బాలికల్లో ప్రసాదంపాడుపై నూతనకల్, హుజూర్‌నగర్‌పై సూర్యాపేట, నందిగామపై మంగళగిరి విజయం సాధించాయి. ఇక కబడ్డీ బాలుర విభాగంలో మఠంపల్లిపై సూర్యాపేట, ప్రసాదంపాడుపై హుజూర్‌నగర్, మఠంపల్లిపై నూతనకల్ జట్టు విజయం సాధించింది.

20న జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ ఎంపిక పోటీలను ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎండీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్–16, 18, 20, పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 23వ తేదీన కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

శ్రీరామకోటితో భద్రాద్రికి పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

అశ్వారావుపేటరూరల్: శ్రీరామకోటితో భక్తుల బృందం కాలినడకన భద్రాచలంలోని రామాలయానికి తరలివెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని ముల్లేటిమొగ్గ గ్రామానికి చెందిన 90 మంది రామభక్తులు రామకోటి రాశారు. లిఖించిన రామకోటిని స్వయంగా భద్రాద్రి రామయ్యకు సమర్పించేందుకు ఈ నెల 8వ తేదీన ముల్లేటిమొగ్గ గ్రామంలో పాదయాత్రగా బయలుదేరగా, శనివారం అశ్వారావుపేట మండలానికి చేరుకున్నారు. ఈ నెల 19వ తేదీ రాత్రికి భద్రాచలం చేరుకుంటామని, స్వామి వారిని దర్శించుకొని రామకోటిని సమర్పిస్తామని బృందం సభ్యులు వైదాడి అప్పలనరసయ్య, రాంబాబు, అభిరాజు తెలిపారు. 300 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగుతుందని, మార్గమధ్యలో భోజనాలు, వసతిని స్వచ్ఛందంగా కల్పిస్తున్నారని, సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు.

శుభలేఖలు ఇచ్చి వెళ్తూ మృత్యుఒడికి..

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి గాయాలు

సత్తుపల్లిరూరల్: బంధువుల ఇంట్లో పెళ్లి జరగనుండగా శుభలేఖలు ఇచ్చి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. మధిర మండలం కంభంపాడు గ్రామానికి చెందిన షేక్ రాంబాబు(56), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం ఎర్రగుంటకు చెందిన నాగుల్‌మీరా తమ బంధువుల పెళ్లి కార్డులను శనివారం సత్తుపల్లిలో పలువురికి అందజేశారు. అనంతరం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సత్తుపల్లి మండలం కిష్టారం వై జంక్షన్ వద్ద వీరి వాహనాన్ని లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందగా, నాగుల్‌మీరాకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, రాంబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా ఘటనపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పోలీసులు తెలిపారు.

ఏపీ పోలీసుల అదుపులో నాచేపల్లి యువకుడు

యువతి మిస్సింగ్ కేసులో విచారణ

నేలకొండపల్లి: సామాజిక మాధ్యమాల ద్వారా జిల్లాకు చెందిన ఇద్దరు యువకులకు ఏపీకి చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడగా తరచు ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఇందులో ఓ యువకుడు ఆమెను కలిశాక ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. వివరాలిలా.. నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి, ముదిగొండ మండలానికి చెందిన ఇద్దరు యువకులకు ఏపీలోని విజయవాడకు చెందిన ఓ యువతి సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైంది. ఇరువురు ఆమెతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండగా, రెండు రోజుల క్రితం నాచేపల్లి యువకుడు విజయవాడకు వెళ్లి ఆమెను కలిసి వచ్చినట్లు తెలిసింది. ఆతర్వాత ఆమె ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కిడ్నాప్ కేసు నమోదు కాగా, ఆమె ఫోన్ డేటా పరిశీలించిన పోలీసులకు నాచేపల్లి, ముదిగొండ యువకుడు ఎక్కువ సార్లు మాట్లాడినట్లు తేలింది. దీంతో విజయవాడ పోలీసులు శనివారం నాచేపల్లికి వచ్చి యువకుడిని అదుపులోకి తీసుకుని నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో విచారించగా యువతిని కలిసింది నిజమే అయినా ఆమెను తీసుకురాలేదని తెలిపాడు. అలాగే, ముదిగొండ మండలానికి చెందిన యువకుడిని కూడా విచారించారు. ఈ విషయమై నేలకొండపల్లి ఎస్సై బి.సతీష్‌ను వివరణ కోరగా... విజయవాడ పోలీసులు విచారణ కోసం నాచేపల్లి యువకుడిని తీసుకెళ్లారని తెలిపారు.

గంజాయి పట్టివేత



గంజాయి, నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ద్విచక్ర వాహనంపై తొమ్మిది కేజీల ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు శనివారం పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారుల కథనం ప్రకారం.. ఇల్లెందు క్రాస్ రోడ్డులో ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పల్సర్ బైక్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వెళ్తుండగా వారిని ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో తొమ్మిది కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద నుంచి బైక్, మొబైల్ స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశామని జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వరరావు, కొత్తగూడెం సీఐ జయశ్రీ తెలిపారు. గంజాయి విలువ రూ.2.25 లక్షల వరకు ఉంటుందని వారు చెప్పారు. తనిఖీల్లో ఎస్‌ఐ గౌతమ్, అశోక్, హబీబ్‌పాషా, రామకృష్ణగౌడ్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వనరుల దోపిడీకే సలాటోంగు క్యాంపు

లేఖ విడుదల చేసిన మావోయిస్టులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సలాటోంగు అటవీ ప్రాంతంలో అక్రమంగా పోలీసుక్యాంపు ఏర్పాటుచేశారని కిష్టారం ఏరియా కమిటీ కార్యదర్శి రాజు విమర్శించారు. ఈమేరకు శనివారం ఆయన లేఖ విడుదల చేశారు. అటవీ ప్రాంతంలో నీరు, అటవీ సంపదను లాక్కోవాలనే పెట్టుబడిదారుల ఉద్దేశానికి అనుగుణంగా ఏర్పాటు చేసిన ఈ క్యాంపునకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రజా ఉద్యమానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామసభ అనుమతి లేకుండా ఈ నెల 11న పోలీసు శిబిరం ఏర్పాటు చేయగా, స్థానికులు నిరసన తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలోకి రాగానే స్థానిక గిరిజనులపై అణచివేత పెంచారని, అదే సమయాన కార్పొరేట్, సైనికీకరణను విస్తృతంగా ప్రోత్సహిస్తూ కొత్త పోలీసు క్యాంపులు నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఇందుకోసం గ్రామస్తుల నుంచి భూమి లాక్కోవడమే కాక గ్రామస్తులు పొడియం హిద్మా, పూనెం హిద్మా, రవ్వ హుంగా, మడకం ఆయతను కొట్టి చంపారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో సహజ సంపదను దోచుకుని ఆదివాసీలను పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చేందుకు జరుగుతున్న యత్నాలను మావోయిస్టు పార్టీ ఖండిస్తోందని రాజు ఆ లేఖలో వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు: ఉప్పుసాక గ్రామానికి సమీపంలోని కిన్నెరసాని నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

తప్పించుకున్న మావోయిస్టు ముఖ్య నేతలు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శనివారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టు పార్టీకి చెందిన ముఖ్య నాయకులు తప్పించుకున్నారు. ఈ సందర్భంగా మావోయిస్టుల శిబిరాన్ని ధ్వంసం చేసిన పోలీసులు వారికి సంబంధించి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దకొర్మెల అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ గంగులూరు ఏరియా కమిటీ కార్యదర్శి మిడియం దినేశ్, గంగులూరు ఎల్‌ఓఎస్ కమాండర్ దూలకారం దళాలతో సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ కోబ్రా విభాగాలకు చెందిన బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున పోలీసు బలగాలకు పెద్దకొర్మెల అటవీ ప్రాంతంలో తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో పోలీసు బలగాలు సైతం ఎదురుకాల్పులు జరిపారు. అనంతరం ఘటనా ప్రాంతంలో మావోయిస్టులకు సంబంధించి నిత్యావసరాలు, విప్లవ సాహిత్యం, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పట్టపగలు సైకిల్ చోరీ



సైకిల్ తీసుకెళ్తున్న యువకుడు

పాల్వంచ: పట్ట పగలు ఓ గుర్తుతెలియని యువకుడు ఇంట్లోని సైకిల్‌ను చోరీ చేసిన ఘటన పట్టణ పరిధి రాంనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రాంనగర్ ప్రాంతంలో బి.వెంకట్రావు ఇంటికి ఓ యువకుడు వచ్చి గేటు తీసుకుని లోపలికి ప్రవేశించి సైకిల్‌ను చాకచక్యంగా తీసుకుని పరారయ్యాడు. ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డ్ అయింది. చోరీకి గురైన సైకిల్ విలువ రూ.8 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.